
# కలం స్నేహం చేద్దామా?

తిమ్మారావు చదువు పూర్తయిపోయింది. ఎంప్లాయ్‌మెంట్‌లో తన పేరు రిజిస్టర్ చేయించేశాడు. న్యూస్ పేపర్లలో కనబడిన ప్రతి ఉద్యోగానికీ అప్లయ్ చేస్తున్నాడు. చాలా ఇంటర్వ్యూలకి అటెండ్ అవుతున్నాడు... కానీ ఉద్యోగం రాలేదు. అంచేత ఇంట్లోనే ఉండి ఏమీ తోచక గోళ్ళు గిల్లుకుంటున్నాడు.




ఒకరోజు తిమ్మారావు న్యూస్ పేపర్ చదువుకుంటున్న తండ్రి పరంధామయ్య చేతిని హఠాత్తుగా లాక్కుని నోట్లో పెట్టుకున్నాడు.

"ఏయ్ టామీ... ఏంటది... చెయ్యొదులు... ఊ..." అన్నాడు పరంధామయ్య పేపర్లోంచి తలెత్తకుండానే.

"ఊహూ... ఉహూ... ఉహూ..." చేతిని నోట్లో ఉంచుకునే నవ్వాడు తిమ్మారావు.

"టామీ... చెయ్యొదులు... ఏంటా పిచ్చినవ్వు? ఆయ్!..." అన్నాడు పరంధామయ్య.

అంతలోనే ఆయనకి అనిపించింది - టామీ ఏంటి మనిషిలా నవ్వడం ఏంటి? అని. పేపర్లోంచి తలెత్తి చూశాడు. సుపుత్రుడు తిమ్మారావు కనిపించాడు.

పరంధామయ్య చటుక్కున కొడుకు నోట్లోంచి తన చేతిని లాగేస్కున్నాడు.
"నేను నాన్నా... ఇందాకట్నించి టామీ అనుకున్నావ్ కదూ? హిహి?" అన్నాడు తిమ్మారావు.
"ఏడ్చావ్‌లే, వెధవ నవ్వూ నువ్వూను... ఇంతకీ నా చెయ్యెందుకలా నోట్లో పెట్టుకున్నావ్?" మొహం చిట్లించి కొడుకుని అడిగాడు.
తిమ్మారావు సిగ్గుపడ్తూ తన రెండు చేతులూ ముందుకు చాపి చూపించాడు.
"హర్రే... నీ వేళ్ళకి గోళ్ళు లేవే!!... నీ గోళ్ళేమయ్యాయ్?!..." ఆశ్చర్యంగా అడిగాడు పరంధామయ్య.
"నావా?... హి! మరేమో నాకేమీ పనీపాట లేదుకదా? ... అందుకే గోళ్ళు కొరికి తినేశా .. . మరి నా గోళ్ళు అయిపోయాయ్ కదా... అందుకే మీ చెయ్యి నా నోట్లో పెట్టుకున్నా... నాన్నా నాన్నా... ఇవ్వు నాన్నా నీ గోళ్ళు కొరుకుతా..." గోముగా అన్నాడు తిమ్మారావు.
పరంధామయ్య చటుక్కున తన రెండు చేతులూ వెనక్కి పెట్టేస్కున్నాడు.
"హమ్మా... నేను ఇవ్వను... నా గోళ్ళు నువ్వు కొరికేస్తే నాకెప్పుడైనా దురదేస్తే ఎట్టా గోక్కుంటాను? అయినా, ఏమీ తోచకపోతే ఇంకేదైనా పని చెయ్యాలిగానీ గోళ్ళు కొరుకితే ఎలా? గోళ్ళు కొరక్కూడదు తప్పు!... ఇంకెప్పుడూ గోళ్ళు కొరక్కు..." అన్నాడు కొడుకుని మందలిస్తూ.
"కొరకడానికి నాకు గోళ్ళుంటేగా? హి!"
"అఘోరించావ్ గానీ... ముందిక్కడ్నుంచి వెళ్ళు..."
తిమ్మారావు తల్లినీ, చెల్లినీ కూడా బతిమిలాడాడు. కానీ వాళ్ళు కూడా తమ తమ గోళ్ళు తిమ్మారావు కొరకడానికి ఒప్పుకోలేదు.
ఇలా లాభం లేదని తిమ్మారావు ఆలోచించి ఆలోచించి ఒక మృదంగం కొనుక్కున్నాడు.
"ఇదెందుకు? పెళ్ళిళ్ళలో వాయించడానికి కొన్నావా?" ఆశ్చర్యంగా మృదంగం వంక చూస్తూ కొడుకుని అడిగాడు పరంధామయ్య.
"ఛీ యేంటి నాన్నా అట్లాగంటావు?... నేను శాస్త్రీయ సంగీతం నేర్చుకుందామని అనుకుంటున్నా... మరి ఊర్కే కూర్చుంటే నాకేం తోస్తుంది చెప్పండి" అన్నాడు తిమ్మారావు.
తిమ్మారావు మృదంగం నేర్చుకోవడం మొదలుపెట్టాడు. రోజంతా ఖాళీయే కాబట్టి తెగ ప్రాక్టీసు చెయ్యసాగాడు.
ఒకరోజు పిల్లికి పక్క పోర్షనులోనే ఉండే ఇంటి ఓనరు కోపంతో

బుసలుకొడ్తూ వచ్చాడు.
"చూడబ్బాయ్... నువ్విట్టా ధమాధమా వాయిస్తే కుదర్దు... నువ్వీ మృదంగం కొన్నప్పటినుండి మా ఆవిడకి బి.పి. పెరిగిపోయింది. దానికి బి.పి. పెరగడం నా చావుకొచ్చింది. చీటికి మాటికీ నన్ను తిడ్తుంది... నువ్వు మృదంగం ఎక్కువగా ప్రాక్టీస్ చేసిన రోజున బీపీ మరీ ఎక్కువైపోయి నన్ను కొడ్తుంది కూడా... నువ్వు మృదంగం వాయించడం ఆపకపోతే ఇల్లు ఖాళీ చేయించాల్సి వస్తుంది" అంటూ వార్నింగ్ ఇచ్చాడు ఆయన.
దాంతో తిమ్మారావు సంగీత సాధనకి బ్రేక్ పడింది.
తిమ్మారావు మొదట్లో చాలా నిరుత్సాహపడినా అతనికి మరో బ్రిలియంట్ అయిడియా వచ్చింది. వెంటనే అతను తండ్రి దగ్గరికి వెళ్లి మెలికలు తిరిగిపోయాడు.
"మరీ అంతగా మెలికలు తిరిగిపోకు... కాళ్లూ చేతులూ ఒంకర్లు పోతాయ్... సరిగ్గా నిలబడి అసలు సంగతేంటో చెప్పు..." అన్నాడు పరంధామయ్య కళ్ళు చిట్లించి చూస్తూ.
"మరేమో ... నాన్నా... ఇంటిదగ్గరుంటే నాకేమీ తోచడంలేదు కదా?... అందుకే నాకో మాంచి అయిడియా వచ్చింది..." అన్నాడు తిమ్మారావు కళ్ళింత చేస్తూ.
"ఏంట్రా బాబూ అది?" ప్రేమగా కొడుకు వంక చూస్తూ అడిగాడు పరంధామయ్య.
"మరేమో ... మరేమో... నాకు పెళ్ళి చేసెయ్ నాన్నా... చక్కగా కొత్త పెళ్ళాంతో కాలక్షేపం చేస్తాను... ఆ తర్వాత పిల్లలు పుడ్తారు ... ఇంచక్కా వాళ్లతోకూడా ఆడుకుంటూ కాలక్షేపం చేస్తాను..." అన్నాడు సంబరంగా తిమ్మారావు.
పరంధామయ్యకి తిక్క రేగిపోయింది.
"నోర్ముయ్... నీకు పెళ్ళి కావాల్సివచ్చిందా? నీకు పెళ్లయి పిల్లలు పుట్టి వాళ్లు పెరిగి నీతో ఆటలాడేదాకా నీకుద్యోగం దొరకదా?..."
"ఏమో?... ఎవరికి తెల్సు?..." నసిగాడు తిమ్మారావు.
"ఏ పనీపాటలేని నిన్నే కాకుండా నీ పెళ్ళాన్ని కూడా మేపమంటావా?... వీల్లేదు. నీకు ఉద్యోగం వచ్చాకే పెళ్ళి" అన్నాడు పరంధామయ్య
తిమ్మారావుకి రెండ్రోజులు పోయింతర్వాత మరో మంచి ఆలోచన వచ్చింది. వెంటనే అతను ఓ వారపత్రికలో కలం స్నేహితుల శీర్షికకి

తన పేరుని సరోజగా మార్చి తన ఇంటి అడ్రసు ఇచ్చాడు. కొన్నాళ్ల తర్వాత సరోజ పేరుతో ఇతని చిరునామా కలం స్నేహితుల శీర్షిక కింద ప్రచురింపబడింది.
అమ్మాయి పేరుతో అడ్రసు పడిందంటే అబ్బాయిలు ఊర్కుంటారా? ఊర్కోరు!... అందుచేత కుప్పలు తిప్పలుగా అబ్బాయిల దగ్గర్నుండి ఉత్తరాలు రాసాగాయ్. ఆ ఉత్తరాలన్నీ చదువుతుంటే తిమ్మారావ్‌కి మంచి కాలక్షేపంగా ఉంది. "దేశంలో ఇంత పిచ్చిముండా కొడుకులున్నారా? అనుకున్నాడు కొన్ని ఉత్తరాలు చూసి.
ఒకడేమో "సరోజగారూ ... ఎందుకో మీతో స్నేహం చేయాలని నా మనసు ఎంతో ఉవ్విళ్లూరుతుంది... నాతో స్నేహం చేస్తారు కదూ?" అని రాశాడు.
ఇంకోడేమో "డియర్ సరూ. నేనిలా సంబోధిస్తుంటే ఆశ్చర్యపడ్తున్నావ్ కదూ? ... నీ పేరు చూడగానే నాకెందుకో మనది జన్మజన్మల బంధం అనిపించింది. నీ పేరు తల్చుకుంటేనే నా ఒళ్ళంతా అదేదో మాదిరిగా అయిపోసాగింది" అంటూ ఇంకా చాలా చాలా రాశాడు.
ఇంకో పిచ్చోడేమో 'సరోజగారూ... ఇక్కడ నా అభిమాన హీరో చెక్కమొహం చమక్‌రావు నటించిన సినిమా వంద రోజులు ఆడింది. మీ ఊళ్లో ఎన్ని రోజులాడిందో తెలియజెయ్యవలసిందిగా కోరుతున్నాను." అని రాశాడు.
చాలామంది సన్నాసులు "సరోజా, ఐ లవ్ యూ" అంటూ ఏవేవో పిచ్చిరాతలు రాశారు.
కొంతమంది అబ్బాయిలేమో ఉద్యోగానికి దరఖాస్తు పెడ్తున్నట్లుగా వాళ్ల పూర్తిపేరు, తండ్రిపేరు, పుట్టిన తేదీ, క్వాలిఫికేషన్స్, చేస్తున్న ఉద్యోగం, వచ్చే జీతం మొదలైన వివరాలన్నీ ఇస్తూ వాళ్ల ఫోటో కూడా పంపించి "సరోజగారూ... మీ అందమైన ఫోటో పంపిస్తే జీవితాంతం పదిలంగా దాచుకుంటాను..." అంటూ రాశారు.
తను అమ్మాయి అనుకుని అంతమంది అబ్బాయిలు అలా క్రేజీగా ఉత్తరాలు రాస్తుంటే తిమ్మారావుకు గమ్మత్తుగా అనిపించింది. చాలా మంచి కాలక్షేపంలే అనుకున్నాడు. బాగా క్రేజీగా ఉత్తరం రాసిన అబ్బాయిలని ఏడిపించటం కోసం సరోజ పేరుతోనే చాలా టెంప్ట్ చేస్తూ రిప్లయ్‌లు రాశాడు. అలా వేరే ఊళ్లో ఉండే అబ్బాయిలకే రాశాడు. ఉన్న ఊళ్లో అబ్బాయిలకు రాస్తే ఇంటికి పరుగెత్తుకుని వచ్చినా వచ్చేస్తారు.
కానీ తిమ్మారావుకి ఆ మాత్రం కాలక్షేపం సరిపోలేదని అనిపించింది.

తిమ్మారావుకి వచ్చే ఉత్తరాల్లో అమ్మాయిలు రాసినవి కూడా ఉన్నాయ్. వాళ్లలో కూడా చాలామంది పిచ్చిపిచ్చిగానే ఉత్తరాలు రాస్తున్నారు.
ఒకమ్మాయేమో "అక్కా ... నాకు పూరీలు వత్తడం అస్సలు రాదు... అదేంటోగాని ఒక్కోపూరి ఒక్కో షేపులో అదేదో రాష్ట్రం మ్యాపులా వస్తుందక్కా... నీకు పూరీలు వొత్తడం వచ్చా అక్కా?" అని రాసింది.
ఇంకో పిచ్చిదేమో "చెల్లీ ... నువ్వు 'తీరిన తాపంలో ఆరని శాపం' అనే నవల చదివావా?... అందులో హీరోయిన్ని హీరో అపార్థం చేసుకున్న సీను చదువుతున్నప్పుడు నిజంగా నాకు కన్నీళ్లు ఆగలేదు... వెక్కి వెక్కి ఏడ్చాను. ఆ నవల చదివితే నువ్వు కూడా ఆ సీనులో ఏడ్చే ఉంటావ్... నా అభిమాన రచయిత కాపీల పాపారావు, రచయిత్రి గోంగూర గంగమ్మ... నీ అభిమాన రచయిత, రచయిత్రి ఎవరు?..." అంటూ రాసింది.
మరొక అమ్మాయేమో "నాకు అలాంటి చీరలంటే ఇష్టం, ఇలాంటి ఫాషన్లంటే ఇష్టం... నీకెట్లాంటి చీరలంటే ఇష్టం? " అంటూ రాసింది.
ఇంకో అమ్మాయేమో తనకి నచ్చిన ముగ్గులు కాగితంమీద వేసి పోస్టుచేస్తూ "నీకు నచ్చిన ముగ్గులు నాకు పంపించక్కా..." అంటూ ప్రార్థించింది.
అమ్మాయిల ఉత్తరాలు కూడా అన్నీ ఇలానే పిచ్చిపిచ్చిగా ఉన్నాయ్.
ఒకమ్మాయ్ మాత్రం చాలా చక్కగా రాసింది ఉత్తరాన్ని. సంతకం చూశాడు. రాధ అని పెట్టింది.
తిమ్మారావు ఆ అమ్మాయికి 'డియర్ రాధా' అని సంబోధిస్తూ ఉత్తరం రాశాడు. మూడోరోజుకల్లా 'డియర్ సరోజా' అని అక్కడినుండి జవాబు వచ్చింది. తిమ్మారావుకి రాధతో పరిచయం పెంచుకోవాలని అనిపించింది. స్నేహం పెరిగిన తర్వాత 'నేను అమ్మాయిని కాదు అబ్బాయిని. నా పేరు సరోజ కాదు తిమ్మారావు' అని చెప్పేస్తే మొదట్లో అబద్ధం చెప్పినందుకు కాస్త బాధపడినా తరువాత స్నేహం కంటిన్యూ చేసేస్తుంది.
ఈసారి తిమ్మారావు "మై డియరెస్ట్ రాధా" అని ఉత్తరం రాశాడు. దానికి రాధ "నా సరూ" అంటూ తిమ్మారావుకి ఉత్తరం రాసింది.
ఇద్దరూ కొన్నాళ్ళు ప్రాణ స్నేహితుల్లాగా ఉత్తరాలు రాస్కున్నారు.
ఒకరోజు రాధ దగ్గర్నుండి "మనం ఇద్దరం ఒకే ఊళ్ళో ఉండి ఇన్నాళ్లూ కలవకుండా ఉండటం నాకేం నచ్చలేదు... నేను ఫలానా రోజు మీ ఇంటికి వస్తున్నా ... నా కోసం ఏం స్పెషల్ వంటకాలు చేస్తావో

చూస్తా..." అంటూ ఉత్తరం రాసింది.

తిమ్మారావుకి ఆ ఉత్తరం చూడగానే ఒక పక్క గుండెల్లో దడగా అనిపించింది. ఒక పక్కనేమో సంతోషంగా అనిపించింది.

రాధ రాకకోసం గంటలు, నిమిషాలు లెక్కబెడ్తూ చూశాడు. చివరికి రాధ వచ్చేరోజు రానే వచ్చింది.

ఆరోజు కాలింగ్ బెల్ మోత వినబడగానే తిమ్మారావు పరుగెత్తుకుని వచ్చి తలుపు తీశాడు. గుమ్మం అవతల ఒక పాతికేళ్ళ యువకుడు నిలబడి ఉన్నాడు.

"ఎవరు కావాలండీ?" తిమ్మారావు అతన్ని అడిగాడు.

"సరోజగారు ఉన్నారాండీ?" అని అడిగాడు.

తిమ్మారావు సిగ్గుపడ్డాడు.

"ఇక్కడ సరోజ అని ఎవరూ లేరండీ... నేనే సరోజ అనే పేరుతో కలంస్నేహం శీర్షికకి పేరిచ్చాను..." అన్నాడు.

అతను అదోలా చూస్తూ వంకరగా నవ్వి ఇలా అన్నాడు:

"అలాగా... రాధ అనే పేరుతో మీకు ఉత్తరాలు రాసింది నేనే... నా పేరు రాధాకృష్ణ."

"ఆ! ... ... " నోరు తెరిచాడు తిమ్మారావు.

* * *